


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 584 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర 13 గురువారం నవంబర్ 2025 పేజీలు : 4 వెల : అమూల్యం

## కొందరు ఎమ్మెల్యేల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఏపీ డిప్యూటీ సీఎం

**- వారు చెబితేనే పనులవుతాయా, పరిస్థితి చక్కదిద్దాలి**

**- ఏపీ సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫిర్యాదు**

మంగళగిరి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కొందరు ఎమ్మెల్యే తీరు పైన ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రజల ఆస్తి వివాదాల్లో తల దూర్చుతున్నారని, ఏ పార్టీ ఎమ్మెల్యే తప్పు చేసినా కఠినంగా వ్యవహరించాలని కేబినెట్ భేటీలో సూచించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని, పార్టీలతో సంబంధం లేకుండా కూటమి ఎమ్మెల్యేలను గట్టిగా హెచ్చరించాలని కోరారు. పవన్ వ్యాఖ్యల పైన సీఎం చంద్రబాబు వెంటనే స్పందించారు.

ఎవరైనా ఎమ్మెల్యేలు గీత దాటితే కఠినంగా ఉండాలని, వారి విషయంలో ఇంఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేసారు. డిప్యూటీ సీఎం పవన్ వివాదాల్లో తల దూర్చుతున్న ఎమ్మెల్యేల తీరు పైన మండిపడ్డారు. తాజాగా జరిగిన మంత్రివర్గ భేటీలో పవన్ ఈ అంశాలను ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని పదే పదే చెబుతోందని, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది..



## సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది

**- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**



మంగళగిరి, సింహగర్జన సంపాదకుడు, డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 12 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఈ విధంగా రాసుకొచ్చారు. అందులో తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కేవలం యాత్రా స్థలం మాత్రమే కాదని, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది హిందువుల భక్తి, విశ్వాసాలకు ప్రతీక అని అభివర్ణించారు. అలానే తిరుమల లడ్డూ కేవలం తీపి పదార్థం కాదని, భక్తుల సమిష్టి భావోద్వేగం అని పవన్ అన్నారు. ప్రతి భక్తుడు లడ్డూని తన కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకోవడం దైవానుగ్రహం పంచుకున్నట్లేనని చెప్పారు. మరోవైపు సెక్యులరిజం అనేది ఒకపక్కకు మాత్రమే పరిమితం కాకూడదని అన్నారు. అన్ని మతాలనూ, విశ్వాసాలనూ సమానంగా గౌరవించడమే నిజమైన లౌకికత అని ఆయన స్పష్టం చేశారు. ఒక మతంపై వ్యాఖ్యలు చేస్తూ మరొక మతాన్ని కించపరచడం సెక్యులరిజం కాదని.. ఇలాంటి ధోరణులు సమాజంలో విభజనకు దారి తీస్తాయని హెచ్చరించారు. ఇక ప్రతి సంవత్సరం సగటున 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శించి.. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం పొందుతున్నారని పవన్ గుర్తు చేశారు. ట్వీట్‌లో సనాతన ధర్మ పరిరక్షణకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు.



## అటవీ భూములు ఆక్రమించిన వారి వివరాలు శాఖ వెబ్ సైట్‌లో వెల్లడించాలి

**- ఎవరి ఆక్రమణలో ఎంత ఉంది? వారిపై నమోదైన కేసుల వివరాలు ప్రజలకి తెలియాలి**

**- అటవీ ఆస్తులను కబ్జా చేస్తే కఠిన చర్యలకి ఉపక్రమించండి**

**- మంగళంపేట అటవీ భూముల ఆక్రమణలపై విజిలెన్స్ రిపోర్డులను ప్రాతిపదికగా తీసుకొని ముందుకు వెళ్ళాలి**

**- మాజీ అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి అడవుల్లో వారసత్వ భూములెలా వచ్చాయి..?**

**- రాజకీయాలకు అతీతంగా భావి తరాలకు ప్రకృతి సంపద అందించాలి**

మంగళగిరి, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాండ్ర, నవంబర్ 12 : అటవీ భూములు ప్రకృతి సంపద.. జాతి ఆస్తి. వాటిని ఆక్రమించిన వారు, చట్టాన్ని ఉల్లంఘించి అతిక్రమణలకు పాల్పడిన వారు కచ్చితంగా శిక్షార్హులవుతారు. అటవీ భూముల జోలికి వెళితే అది ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదు. అటవీ భూములను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దీన్ని నెరవేర్చే ప్రక్రియను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతుందని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. వన్య ప్రాణి రక్షిత అటవీ భూముల్లోను, అటవీ ప్రాంతాల్లోనూ అటవీ ఆస్తులు కబ్జా చేసి భారీ భవంతులు, ఎస్టేట్స్ నిర్మించినవాళ్లు ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చట్ట ప్రకారం ముందుకు వెళ్ళాలి అన్నారు. అటవీ భూములను రక్షించుకొని, రాబోయే తరాలకు అందజేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎవరికీ భయపడాల్సిన పని లేదని, మనో ధైర్యంతో ముందుకు వెళ్దామని అటవీ అధికారులకు పవన్ కళ్యాణ్ భరోసా ఇచ్చారు.




## ఏపీలో డ్వాక్రా మహిళలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

**- సబ్సిడీపై ఈ-బైక్, ఈ-ఆటో**

అమరావతి, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : ఏపీలో డ్వాక్రా మహిళలకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఈ-బైక్, ఈ-ఆటో సబ్సిడీ అందిస్తోంది. ఇందులో ఈ-బైక్ కొనుగోలు చేస్తే రూ.12వేలు సబ్సిడీ, ఈ-ఆటో కొనుగోలు చేస్తే రూ.30వేలు సబ్సిడీ అందిస్తోంది. పెట్టుబడి లేకుండా బ్యాంక్ రుణం పొందే అవకాశం కల్పిస్తారు. రాపిడో ద్వారా నెలకు రూ.25వేలు నుంచి రూ.30 వేలు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

అలాగే ఉచిత డ్రైవింగ్ శిక్షణ కూడా అందుబాటులో ఉంచుతున్నారు. దీనికి ప్రధాన అర్హత డ్వాక్రా గ్రూప్ సభ్యురాలు అయి ఉండాలి. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. 21 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయసు మధ్య ఉండాలి. దరఖాస్తు చేసేందుకు జిల్లా మెప్మా కార్యాలయాన్ని సంప్రదించాలి. అక్కడ డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, డ్వాక్రా ఐడీ సమర్పించాలి. అలాగే దరఖాస్తు ఫారం నింపాలి. 15 రోజుల్లో లబ్దిదారుల్ని ఎంపిక చేస్తారు. ఎంపికైతే ఈ-బైక్ లేదా ఈ-ఆటో అందజేస్తారు. అయితే ఈ పథకం ప్రస్తుతం విజయవాడ , విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, నెల్లూరు, కర్నూలులోనే అందుబాటులో ఉంది



# ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంలో, విద్య కీలక పాత్ర పోషిస్తుంది




4విజయవాడ, సింహగర్జన సంపాదకుడు డా సునీల్ కుమార్ యాంద్ర, నవంబర్ 12 : ప్రజాస్వామ్యం అంటే ప్రజల పాలన ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజలతో నడిచే వ్యవస్థ. అయితే ఈ వ్యవస్థ బలంగా ఉండాలంటే ప్రజలకు సరైన అవగాహన, బాధ్యత, నైతికత ఉండాలి. ఈ లక్షణాలను మనలో పెంచేది ఒక్క విద్యే మాత్రమే. విద్య మనిషిని చీకటి నుండి వెలుగులోకి తీసుకువెళ్తుంది. అది కేవలం చదవడం, రాయడం నేర్పడమే కాదు, మన హక్కులు, విధులు, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ వంటి విలువలను అర్థం చేసుకోవడానికి మార్గం చూపుతుంది. అజ్ఞానం ఉన్నచోట ప్రజాస్వామ్యం బలహీనమవుతుంది, కానీ విద్య ఉన్నచోట సహనం, గౌరవం, ఐక్యత పెరుగుతాయి. ఇస్లాంలో కూడా జ్ఞానాన్ని వెలుగు అజ్ఞానాన్ని చీకటిగా పేర్కొంది. అంటే సమాజంలో శాంతి, సామరస్యాన్ని స్థాపించేది జ్ఞానం అని అర్థం. మనం పొందే విద్య మతం, భాష, వర్గం అనే భేదాలను తొలగించి మనిషి మనిషిగా గౌరవించడాన్ని నేర్పాలి. భారతదేశం అనేక మతాలు, భాషలు, సంస్కృతులు కలిగిన దేశం. ఈ వైవిధ్యమే మన బలం. కానీ ఈ బలం నిలబెట్టుకోవాలంటే మన మాటలు, పనులు ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ఉండాలి. మతం లేదా వర్గం పేరుతో కలహాలు రేపితే అది ప్రజాస్వామ్య వ్యవస్థకు తీరని నష్టం కలుగుతుంది. ప్రజాస్వామ్య బలం విద్యా ప్రమాణాలపై ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం విద్యా రంగంపై ఎక్కువ దృష్టి పెట్టాలి. మంచి విద్యతోనే దేశ భవిష్యత్తు నిర్మాణం జరుగుతుంది. నేటి పరిస్థితుల్లో ముస్లిం సమాజం సహా అనేక వర్గాల్లో విద్యా స్థాయి ఇంకా వెనుకబడి ఉందని అనేక అధ్యయనాలు తేటతెల్లం చేసింది. మన చరిత్ర చూస్తే, ఒకప్పుడు మన విద్యా సంపద ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. అప్పుడు మన పండితులు, శాస్త్రవేత్తలు కొత్త ఆవిష్కరణలు చేసి ప్రపంచానికి మార్గదర్శకులయ్యారు. కానీ ఇప్పుడు మనం ఆ గౌరవాన్ని తిరిగి తెచ్చుకోవాలి. అందుకోసం ఆధునిక విద్యతో పాటు నైతిక విలువలు, ఆధ్యాత్మికత కలిసిన పాఠ్య విధానం ఎంతైనా అవసరం. ఇప్పట్లో విద్యను ఉద్యోగం లేదా డబ్బు సంపాదించే సాధనంగా మాత్రమే చూడటం చాలా విచారకరం. విద్య లక్ష్యం లాభం కాదు సేవ, స్వభావ నిర్మాణం, సమాజ అభివృద్ధి కావాలి. విద్యతో పాటు శిక్షణ (తర్బియా), నైతిక అభివృద్ధి (తజ్కియా) కూడా అంతే ముఖ్యమని ఇస్లామిక్ పండిత నిపుణులు చెబుతున్నారు. సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ జీవితం ఈ విషయంలో మనకు గొప్ప ప్రేరణ కలిగిస్తుంది. ఆయన ముస్లిం సమాజాన్ని విద్యతో ముందుకు తీసుకువెళ్లేందుకు జీవితాన్ని అంకితం చేశారు. ఆయన దూర దృష్టి ఫలితంగా ఏర్పడిన అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం ఇప్పటికీ జ్ఞాన కాంతిగా ప్రకాశిస్తోంది. ఎందరో జీవితాల్లో వెలుగులు నింపింది. విద్య మనలో అవగాహన, సహనం, గౌరవం పెంపొందిస్తుంది. చదువుకున్న పౌరుడు తన హక్కులు, బాధ్యతలను అర్థం చేసుకుంటాడు. అజ్ఞానం అసహనాన్ని పెంచుతుంది. విద్య మాత్రం ఆలోచించే శక్తి, వాదించే స్వేచ్ఛ, పరస్పర గౌరవాన్ని నేర్పుతుంది. ఇవే ప్రజాస్వామ్యం యొక్క అసలైన స్ఫూర్తి. విద్యా వ్యవస్థ నైతికతతో కూడినదిగా, సమాజ సేవకు దోహదపడేదిగా ఉండాలి. విద్య ద్వారా మాత్రమే మనం న్యాయం, సమానత్వం, స్వేచ్ఛను కాపాడగలము. ప్రజలందరికీ సమానంగా విద్య అందినప్పుడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం నిలుస్తుంది. ముగింపుగా చెప్పాలంటే విద్య ప్రజాస్వామ్యానికి పునాది, స్ఫూర్తి, మనుగడకు హామీ. చదువుకున్న, అవగాహన కలిగిన, బాధ్యతగల పౌరులు ఉన్నప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యం జీవిస్తుంది. విద్య మనిషిని మారుస్తుంది, సమాజాన్ని తీర్చిదిద్దుతుంది, దేశాన్ని బలపరుస్తుంది. విద్య ఉన్నచోట వెలుగు, ప్రజాస్వామ్యం ఉన్నచోట సమానత్వం. ఈ రెండూ కలిసినప్పుడే మన దేశం నిజమైన ప్రజాస్వామ్య రాజ్యంగా రాజ్యమేలుతోంది.

# అటవీ భూములు ఆక్రమించిన వారి వివరాలు శాఖ వెబ్ సైట్‌లో వెల్లడించాలి

పుంగనూరు నియోజకవర్గం, పులిచెర్ల మండలం, మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబసభ్యుల చేతిలో ఉన్న సుమారు 104 ఎకరాల అటవీ భూములపై పవన్ కళ్యాణ్ అటవీ శాఖ ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మాజీ అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబసభ్యుల అటవీ భూముల ఆక్రమణల మీద తన వద్ద ఉన్న నివేదికలు, వీడియోలు, ఇతర సమాచారం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సహచర మంత్రుల వద్ద పవన్ కళ్యాణ్ ప్రస్తావించారు. త్వరలోనే అన్ని వివరాలతో ఆక్రమణ విషయాన్ని వెల్లడిస్తామని చెప్పారు. ఇటీవల చిత్తూరు జిల్లా, ముసలిమడుగు కుంకీ ఏనుగుల శిక్షణ శిబిరం సందర్శించిన అనంతరం హెలికాప్టర్ ద్వారా మంగళంపేట అటవీ ఆక్రమణలను పరిశీలించారు. అడవిలో వేసిన కంచె, సరిహద్దులను విహంగ వీక్షణం ద్వారా తెలుసుకున్నారు. ఈ క్రమంలో అటవీ భూములు, శాఖ ఆస్తులు పరిరక్షణ అంశంపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో తాజాగా సమీక్షించారు. మంగళంపేట అటవీ భూముల అంశాన్ని అధికారులు వివరించారు. అటవీ చట్టం ప్రకారం ప్రిలిమినరీ అఫెన్స్ రిపోర్ట్ (పి.ఓ.ఆర్.), ఛార్జ్ షీట్ దాఖలు చేశామని అటవీ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఆక్రమణలు తొలగించి స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో కేసుల వివరాలు ప్రొడ్యూస్ చేశామన్నారు. పి.ఓ.ఆర్., విజిలెన్స్ నివేదిక వివరాలపై చర్చించిన ఉప ముఖ్యమంత్రి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ అటవీ భూములు ఆక్రమించిన వారి వివరాలు శాఖ వెబ్ సైట్ లో వెల్లడించాలి. ఈ దిశగా ప్రణాళిక సిద్ధం చేయండి. ఎవరి ఆక్రమణలో ఎంత అటవీ ఆస్తి ఉంది? వారిపై నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుతం సదరు కేసులు ఏ స్థితిలో ఉన్నాయి లాంటి వివరాలు ప్రజలకి తెలియాలి.

**- చట్టం కఠినంగానే ఉంది**

అటవీ భూముల పరిరక్షణకు ఉద్దేశించిన చట్టం కఠినంగా ఉంది. చట్టం ప్రకారం ముందుకు వెళ్లాల్సిన విధి అధికార యంత్రాంగంపై ఉంది. అటవీ ఆస్తులను కబ్జా చేస్తే కఠిన చర్యలకి ఉపక్రమించండి. మంగళంపేట అటవీ భూముల వ్యవహారం చూస్తే చట్టం కఠినంగా ఉన్నా అమలు ఆ విధంగా లేకపోవడం మూలంగానే ఆక్రమణలు సాగాయి. మంగళంపేట సర్వే నంబరు 295, 296ల్లో ఉన్న అసలు భూమి విస్తీర్ణం ఎంత..? అది కాలానుగుణంగా ఎలా పెరిగింది అనేది కీలకమైన అంశం. సర్వే నంబర్లను సబ్ డివిజన్ చేసి, అటవీ భూములను ఓ ప్రణాళిక ప్రకారం కలిపేసుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఓ రకమైన భూ లెక్కలు, అడంగల్ లో మరో రకం భూ లెక్కలు కనిపిస్తున్నాయి. వెబ్ ల్యాండ్ నమోదులోనూ మతలబు ఉన్నట్టు కనిపిస్తోంది. ఇదంతా ఎలా జరిగింది..? ఎవరి ప్రమేయం ఉంది అనే అంశాలపై దృష్టి పెట్టాలి.

- న్యాయ నిపుణుల సలహాలు తీసుకొని ముందుకు వెళ్ళాలి

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డిలు 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ అటవీ భూముల గురించి వారి అఫిడవిట్ లో తప్పుడు సమాచారం అందించారనే అంశం నా దృష్టికి వచ్చింది. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి. న్యాయ నిపుణుల సలహా ప్రకారం ముందుకు వెళ్ళాలి. అలాగే భూమి రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 45.80 ఎకరాలు వాళ్ళ అధీనంలో ఉంటే, వెబ్ ల్యాండ్ లోకి వచ్చేసరికి ఆ భూమి 77.54 ఎకరాలుగా చూపారు. ఒకేసారి ఎందుకు ఇంత పెరిగిందన్నది కూడా పరిశీలించాలి. మాజీ అటవీ శాఖ మంత్రి కుటుంబానికి అడవి మధ్యలో ఉన్న భూమి వారసత్వంగా వచ్చిందని చెబుతున్నారు. అసలు అడవి మధ్యలో వారసత్వ భూమి ఎలా వచ్చింది, ఈ భూమి ఎలా ఎప్పుడు చేతులు మారిందనేది తెలుసుకోవాలి. దీనిలో ఎవరి పాత్ర ఎంత అనే దానిపై నివేదికలు తయారు చేయండి.

- విజిలెన్స్ నివేదిక కీలకం

పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై మంగళంపేట అటవీ భూముల ఆక్రమణల మీద ప్రసారమాధ్యమాల్లో కథనాలు వచ్చిన తర్వాత ప్రభుత్వం వేగంగా స్పందించింది. విచారణ కోసం విజిలెన్స్ కమిటీ నియమించింది. ఈ కమిటీ రిపోర్టు అత్యంత కీలకం. ఈ నివేదికలో పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబం ఆక్రమించిన భూముల తాలుకా పూర్తి వివరాలను పొందుపరిచారు. దీన్ని ప్రాతిపదికగా తీసుకోవాలి. అటవీ భూములను ఇష్టానుసారం ఆక్రమించేవారిని ప్రభుత్వం ఉపేక్షించదు. ప్రజలకు సంబంధించిన ఆస్తులు, జాతికి సంబంధించిన ఆస్తులపై కన్నేసే వారిపై నిఘా ఉంచుతాం. ప్రకృతి వనరులను దోపిడీ చేసేవారు, ఆక్రమించుకునే వారిపై రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు.



# లలితాగ్రూపు ఆద్వర్యంలో గోమాతకు పూజలు

మండపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : పవిత్ర కార్తీక మాసంలో గోపూజ చేయడం శుభప్రదమని మండపేట శ్రీ కామాక్షి ఏకాంబరేశ్వర స్వామి ఆలయ అర్చకులు బంటుమిల్లి చంద్రశేఖర్ అన్నారు. లలితా గ్రూపు ఆద్వర్యంలో టౌన్ హాల్ వద్ద గల కామాక్షి ఆలయం వద్ద ప్రతి ఏటా కార్తీకమాసం గోపూజ నిర్వహిస్తారు. ఈ నేపధ్యంలో బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ, ఉషాకుమారి దంపతులు బుధవారం పూజలు నిర్వహించారు. శ్రీమతులైన గోమాతలు, కామధేను సంతానమై, బ్రహ్మపుత్రకులైన పవిత్ర గోమాతలను పూజిస్తే దోషాలు పోతాయని అన్నారు. గోమాతను స్మరణవల్ల సంపూర్ణ పాపవిముక్తి కలుగుతుందని చెప్పారు. వాటికి ఆహారం అందిస్తే సకలదోషాలు పోతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోమాతను అధికసంఖ్యలో మహిళలు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల సుభద్ర, మంగిపూడి లక్ష్మి, గొల్తిలక్ష్మి, యశోద, గౌరి, మాధవి, మౌనిక, చిట్టిమణి, ప్రసన్నకుమారి, పెంకే కళ, జక్కా నాగమణి, గాడు వరలక్ష్మి అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# గవర్నర్ చుండూరి గాయత్రి ,వాసవి క్లబ్ వనిత లెజండ్స్ ఆద్వర్యం లో "డా.పాదర్తి" కి చిరు సత్కారం

కావలి,

వాసవి క్లబ్ వనిత లెజండ్స్ కావలి లో గవర్నర్ బృందం అధికార పర్యటన చేశారు వాసవివనిత క్లబ్ వారు ఏ కార్యక్రమాలు చేసిన ఒక సోదరుడు గా,వాసవి క్లబ్ సేవన్ లయన్స్ మాజీ అధ్యక్షులు డా.పాదర్తి నాగరాజు మాకు మోరల్ సపోర్ట్ గా ఉండి కార్యక్రమంను విజయవంతం చేసేందుకు సహకరించినందుకు గవర్నర్ చుండూరి గాయత్రి బృందం చేతుల మీద చిరు సత్కారంచేయడం జరిగిందిఈ కార్యక్రమం లో ఐ. పి .సి రంగస్వామి, ఆర్. సి అనుమాలశెట్టి కామాక్షి, డి. ఓ నేరెళ్ల సుధారాణి,జడ్. సి పి .లక్ష్మి కుమారి, ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి హేమలత, సెక్రటరీ భవనాసి సువర్ణ, ట్రెసరర్ యస్. గీతదేవి మరియు కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు

# పేదల మధ్య "ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి" పుట్టినరోజు సంబురాలు...

### -బుడంగుంట 17వ వార్డులో అభిమానులు ఘనంగా నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమం..

### -ఎమ్మెల్యే చేతుల మీదగా కేక్ కటింగ్ చేపించిన అభిమానులు..

### -ప్రజల ప్రేమే నా నిజమైన బహుమతి" - ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

కావలి,

ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుండే, ప్రజల హృదయాల్లో చోటు సంపాదించిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అభిమానులు మరోసారి తమ ప్రేమను, అభిమానం వ్యక్తం చేశారు.కావలి బుడంగుంట 17వ వార్డు ఎస్.టి. కాలనీలో ఎమ్మెల్యే అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. పేద ప్రజల మధ్య ఎమ్మెల్యే ముందస్తు పుట్టినరోజు వేడుకలు జరగగా,ఆ ప్రాంగణం ఉత్సాహంతో,ఆనందంతో మార్మోగిపోయింది.ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, మహిళలు,యువకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఎమ్మెల్యే ని చూసేందుకు ఎగబడి వచ్చిన ప్రజలు "జై కావ్య అన్న !"అంటూ హర్షధ్వానాలు చేశారు.పూలదండలు,షాలువాలతో ఎమ్మెల్యే కి ఘన స్వాగతం లభించింది.కేక్ కటింగ్ అనంతరం ఎమ్మెల్యే పిల్లలతో,వృద్ధులతో కలసి ముచ్చటిస్తూ,వారి సమస్యలను తెలుసుకున్నారు.కాలనీలో ఉన్న పేద కుటుంబాల ఇళ్ల వద్దకు వెళ్లి, వారి అవసరాలు, అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ...ప్రజలు చూపిస్తున్న ఈ ప్రేమే నాకు అత్యంత గొప్ప బహుమతి. పుట్టినరోజులు కేవలం వేడుకలు కాదు, సేవకు స్ఫూర్తి కావాలి. నా జీవితం ప్రజల అభివృద్ధికే అంకితం,"అని తెలిపారు. పేద, బలహీన వర్గాల అభివృద్ధి నా ప్రథమ కర్తవ్యం. ప్రతి ఇల్లు వెలుగుతో నిండాలని, ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని నా ఆకాంక్ష. మీ ఆశీర్వాదాలతోనే నా ప్రయాణం కొనసాగుతుంది,"అని అన్నారు.

ప్రజల్లో ఉత్సాహం..

అభిమానులు, పార్టీ కార్యకర్తలు పూలతో, బ్యానర్లతో ఎమ్మెల్యే గారిని ఆహ్వానించారు. కాలనీ అంతా పసుపు జెండాలతో, పండుగ వాతావరణంలో కళకళలాడింది. కేక్ కటింగ్ అనంతరం స్థానిక మహిళలు ఎమ్మెల్యే గారికి హారతులు పట్టి, మిఠాయిలు అందజేశారు.

**ప్రజా సేవకు అంకితమై ఉన్న నాయకుడు..**

ప్రజల పట్ల ప్రేమతో, సేవాభావంతో వ్యవహరించే కావ్య కృష్ణారెడ్డి తరచుగా పేద ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలతో మమేకమవుతుంటారు. పేదల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటారు.కావలి ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ,ఇలాగే ప్రజల పక్షాన నిలబడే నాయకుడుగా ఎల్లప్పుడూ అభివృద్ధి దిశగా నడిపించండి"

అని కోరారు..ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు



# పక్కా గృహాల కొరకు ఈ నెల 30 లోపు నమోదు చేయించుకోవాలి.

గుడ్లూరు,

పక్కా గృహాలు లేని వారు ఈ నెలాఖరులోపు నమోదు చేయించుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఈ ఈ మాధవరావు, ఎంపీడీవో వెంకటేశ్వరావు కోరారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వారు మాట్లాడుతూఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన%-%గ్రామీణ (%గ్రామీణ్-+%) కింద ఇళ్లు లేని పేదలకు గృహ వసతి కల్పించేందుకు గ్రామాలలో సచివాలయ సిబ్బంది నుండి ఒక ఎనిమరేటర్ను గుర్తించి వారిచే మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహించి నవంబర్ 30 తేదీలోగా తప్పనిసరిగా లబ్ధి పొందాల్సిన వారు ఈ మొబైల్ యాప్ లో ఎన్రోల్ కావలెను. మొబైల్ యాప్ ద్వారా ఎన్రోల్ కానీ వారికి దారుల జాబితా లోనికి రానివారికి గృహ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా అందించేటువంటి లబ్ధిని కోల్పోవాల్సి వస్తుంది కాబట్టి ఇల్లు లేని ప్రతి ఒక్క పేదవారు ఈ పథకం ను వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ప్రచారం చేస్తున్నందున ప్రతి ఒక్కరు ఇందులో భాగస్వాములు కావాల్సిందిగా కోరడమైనది. దరఖాస్తుదారులు గ్రామ సచివాలయాల్లో వారి వివరాలతో దరఖాస్తులు సమర్పించవలెను. దరఖాస్తుదారులు ప్రధానంగా వారి యొక్క ఆధార్, రేషన్ కార్డు, ఇంటి పట్టా, బ్యాంక్ వివరాలు, ఫోటోలు సమర్పించాలి. సచివాలయ ఎన్యుమరేటర్లు స్థలాలను పరిశీలించి, పునాది, లింటల్, స్లాబ్, తుది దశల వారీగా నిధులు విడుదల చేస్తారు.అర్హతలు:సొంత స్థలం ఉండాలి ఇల్లు కట్టుకోలేకపోయిన వారు మాత్రమే అర్హులు ఆర్థిక ఆదాయం ప్రభుత్వ నిబంధనలకు సరిపోవాలి గడువు ముగిసే లోపు దరఖాస్తు చేయాలి ఈ పొడిగింపు పేదలకు గృహ నిర్మాణ సౌకర్యాలు సమకూర్చడంలో ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను ఇల్లు లేని పేదలందరు ఉపయోగించుకోవాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు



# టిట్కో ప్లాట్లలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**- అనుమానితుల కోసం తనిఖీలు**

**- 25 వాహనాలు స్వాధీనం**

**- మూడున్నర గంటల పాటు సోదాలు**

మండపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : దేశ రాజధాని ఢిల్లీలో బాంబు పేలిన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రామచంద్రపురం డిఎస్పి రఘువీర్ నేతృత్వంలో మండపేట టిడ్కో ప్లాట్లలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8:30 వరకు సోదాలు చేశారు. మండపేట టౌన్, రూరల్, రామచంద్రపురం సీఐలు డీ.సురేష్, పీ.దొరరాజు, వెంకట నారాయణలు, రాయవరం ఎస్ఐ సురేష్, పామర్రు ఎస్ఐ జానీ బాషా, రూరల్ ఎస్సై వీ.కిషోర్, అంగర ఎస్ఐ హరీష్ కుమార్ లు సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రతీ ప్లాటుకు వెళ్లి స్థానికులను సమాచారం అడిగి తెలుసుకున్నారు. అనుమానితులను ఆరా తీశారు. సరైన రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. టిడ్కో ప్లాట్లలో దాదాపు మూడున్నర గంటల పాటు కార్డెన్ సెర్చ్ జరిగింది. అటు కాలనీకి వచ్చే దారులన్నీ మూసేసి జల్లెడ పట్టారు. అనంతరం రఘువీర్ మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి కార్డెన్ సెర్చ్ లు నిర్వహిస్తామన్నారు. మండపేట టిడ్కో ప్లాట్లలో నిర్వహించిన ఈ తనిఖీల్లో సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు పాల్గొన్నట్టు తెలిపారు. టౌన్ సీఐ డీ.సురేష్ ఆధ్వర్యంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగించామని పేర్కొన్నారు. అక్రమ మద్యం, గంజాయి, చోరీ వాహనాలు, నగదు బంగారం వంటి ఇతర చోరీ వస్తువులు ఏమైనా ఉంటే వాటిని పట్టుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు ప్లాట్లను వినియోగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులను కూడా విచారించడం జరిగిందన్నారు. కాలనీలోని ప్రతి ప్లాటులోకి వెళ్లి స్థానికులను వివరాలతో పాటు ఇళ్లల్లో అద్దెకు ఉంటున్న వారి వివరాలను కూడా తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ప్లాట్లను అద్దెకిచ్చేటప్పుడు వారి పూర్తి వివరాలు ఇంటి యజమాని దగ్గర తప్పనిసరిగా ఉండాలన్నారు. లేదంటే ఏదైనా అసాంఘిక పనులకు ఈ ప్లాట్లను వాడుకున్నట్టు తెలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అద్దెకు ఉంటున్నారు తప్పుడు పనులకు పాల్పడినట్టైంతే వారితో పాటు ఇంటి యజమానిని కూడా బాధ్యులుగా చేసి కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మొత్తం 76 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నట్టు తెలిపారు. 13 బృందాలుగా విడిపోయి సోదాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. 1,632 ఇళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. తెల్లవారుజామున ఉదయం 5 గంటల నుంచి ఉదయం 8:30 వరకు నిర్వహించిన తనిఖీల్లో 25 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్టు వివరించారు. ఈ వాహనాలను పోలీస్ స్టేషన్ కు



తరలిస్తామని, వాహన రికార్డులు సక్రమంగా ఉంటే తిరిగిచేస్తామని, లేదంటే కేసులు నమోదు చేసి అసలు యజమానికి వాహనం అప్పగించడం జరుగుతుందన్నారు. నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరించినట్లయితే పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండపేట టౌన్ రూరల్, రాయవరం, పామర్రు, రామచంద్రపురం స్టేషన్ల పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు.



# ఇళ్ళు నిర్మాణం కోసం రుణాలు

**- ప్రతి పేదవాడికి ఇళ్ళు...కూటమి ప్రభుత్వం లక్ష్యం**

మండపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : గత వైసీపీ హయాంలో వ్యక్తి గత గృహ నిర్మాణ రుణాలు ఇవ్వలేని పరిస్థితి వుంటే కూటమి ప్రభుత్వం సొంత స్తలం వున్న ప్రతి ఒక్కరికి గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేస్తుందని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. 23వ వార్డు సైదిల్ పేట 2వ వీధిలో గల అమరపల్లి శ్రీనివాస్ కి ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 పథకం (గృహ నిర్మాణ) క్రింద మంజూరు అయిన లబ్దిదారుని ఇంటి స్థలం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహనిర్మాణం తమ ప్రభుత్వం చేస్తుందని పేర్కొన్నారు. కమీషనర్ టివి రంగారావు, 23వ వార్డు కౌన్సిలర్ ముక్కా లోవలక్ష్మి, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్, బీజేపీ సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ 23వ వార్డు టిడిపి ఇంచార్జ్ బొడ్డు రామకృష్ణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు జొన్నపల్లి సూర్యారావు, స్పెషల్ ఆఫీసర్ రామకృష్ణ, ఇ.ఇ హౌసింగ్ రమణ, డి.ఇ హౌసింగ్ వెంకట రెడ్డి, హౌసింగ్ ఎఇలు తేజ, వంశీ, దాస్, శ్రీనివాస్ రెడ్డి, ఏమినిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

# పిఏసిఎస్ ఛైర్మన్ వీరకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన స్థానిక నేతలు



తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : తాళ్ళరేవు పిఏసిఎస్ ఛైర్మన్ వివివి ఆదినారాయణ (వీర)కు స్థానిక నేతలు వారి కార్యాలయంలో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ముందుగా కేక్ కటింగ్ చేయించారు. తరువాత వారిని దుశ్శాలువాతో సత్కరించారు. తదుపరి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమానికి కాకినాడ పూర్వపు ఏఎంసీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వర్ రావు (బూరిబాబు), జనసేన మండల కార్యదర్శి అత్తిలి వీరవెంకట సత్యనారాయణమూర్తి (బాబురావు)మరియు బండారు దొరబాబు, ఎలిపే నాగేశ్వరరావు మాస్టర్, సాంబ, కార్యాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పిఏసిఎస్ ఛైర్మన్ వీర తనని సన్మానించిన నేతలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం

**- పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వడంలో తెదేపా ముందుంటుంది**

**- పార్టీ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**- అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్ళాలని సూచన**

కొత్తపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో కొత్తపేట బండారు బులి సత్యం చంద్రావతి కాపు కళ్యాణ మండపంలో మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ మరియు బూత్ కమిటీల ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచనల ప్రకారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత మండల, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ మరియు బూత్ కమిటీల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ గుర్తింపు ఇస్తుంది. కార్యకర్తలే పార్టీకి నిజమైన బలం, సైనికులు అని పేర్కొన్నారు. పదవులు పొందిన వారు అలంకారప్రాయంగా కాకుండా, ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, కూటమి సూచించిన అభ్యర్థుల విజయం కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అందరినీ



సమన్వయం చేసుకుంటూ పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు నడవాలని ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. అనంతరం భోజన కార్యక్రమం నిర్వహించగా, స్వయంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నాయకులు, కార్యకర్తలకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, బండారు సంజీవ్, అలాగే నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

**- తణుకు నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు చుండ్రు ప్రకాష్**



మండపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : టిడిపి బలోపేతని ప్రతి కార్యకర్త కృషి చేయాలని మండపేట పురపాలక సంఘం మాజీ ఛైర్మన్, తణుకు నియోజకవర్గం టిడిపి పరిశీలకులు చుండ్రు శ్రీ వర ప్రకాష్ అన్నారు. తణుకు పట్టణంలో తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ మండల, గ్రామ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్, టిడిపి జోనల్ కో-ఆర్డినేటర్ మందవరపు రవి, పశ్చిమగోదావరి జిల్లా టిడిపి పార్టీ అధ్యక్షుడు రామరాజు, తణుకు నియోజకవర్గ టిడిపి పరిశీలకులు, మండపేట మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చుండ్రు శ్రీ వర ప్రకాష్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకుని, పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం కష్టపడాలని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కష్టపడిన ప్రతి కార్యకర్తను, నాయకులను పార్టీ గుర్తు పెట్టుకుంటుందని తెలియజేశారు.

# ఎంపీఎస్ విద్యార్థుల పట్టుదల అద్భుతం

**- మార్చ్ ఫాస్ట్ తో పాత రోజులను గుర్తుకు తెచ్చారు- ఎంపీఎస్ వార్షిక క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో సీఐ సురేష్**

మండపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : ఎంతో క్రమశిక్షణతో ఎంపీఎస్ విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ చూస్తే ఒకప్పుడు హైదరాబాద్ లో జరిగిన తన పాత రోజులు గుర్తుకు వచ్చాయని మండపేట టౌన్ సీఐ డి.సురేష్ అన్నారు. ఏటా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట ఎంపీఎస్ విద్యా సంస్థలు నిర్వహించే వార్షిక క్రీడా పోటీలను సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. తొలుత జాతీయ జెండాను ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు ఆవిష్కరించగా, స్కూల్ జెండాను సీఐ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు అత్యంత ఆకర్షణీయంగా మార్చ్ ఫాస్ట్ నిర్వహించి సీఐకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆయన క్రీడా జ్యోతిని వెలిగించారు. తదనంతరం జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తన చిన్నతనంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారమని, ఇప్పుడు కూడా అన్ని విద్యా సంస్థలు క్రీడలకు కొంత సమయం కేటాయించాలని సూచించారు. క్రీడలు విద్యార్థులను మానసికంగా రాటుదేలుస్తాయన్నారు. ముఖ్యంగా మార్చ్ ఫాస్ట్ ఎంతో లయబద్ధంగా నిర్వహించారని, దీనిని బట్టి ఈ స్కూల్లో విద్యార్థులకు విద్యను ఎంత అంకితభావంతో నేర్పిస్తారో అర్థం చేసుకోవచ్చన్నారు. స్కూల్ నిర్వాహకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం సీఐను చిన్నారావు మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్, కళాశాల ప్రిన్సిపాల్ సాయి



గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు విద్యార్థులకు పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మూడు రోజులు పాటు జరిగే ఈ పోటీలు ఈ నెల 14న ముగియనున్నాయి.

# ఘనంగా కాలభైరవ జయంతి

ఉమ్మడి మెదక్ జిల్లా, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : రేగోడుమండల కేంద్రంలోని బ్రహ్మంగారిమఠం ఆవరణలో కాలభైరవ స్వామి జయంతి పురస్కరించుకొని కాలభైరవ స్వామి విగ్రహానికి పంచామృతలతో అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం సమయంలో కాలభైరవ స్వామికి జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలభైరవ స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పూజారి శివ కుమార్, బ్రహ్మంగారి కమిటీ సభ్యులు పూర్ణచందర్, శివాజీ పాటిల్, గొల్ల వీరేశం, వడ్డేపల్లి శివ, ఆవుసలి చేన్నప్ప, వడ్ల సత్యం, ముప్పారం ఆంజనేయులు, ఆవుసలి రమేష్, శంకరంపేట విజయ్, వనపర్తి శ్రీనివాస్, దత్తు, బ్రహ్మంగారి శిష్య బృందం గడిల నర్సింలు, కురుమ మల్లయ్య, జేజమ్మల రామా గౌడ్, పోయిన లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఐఎస్ఎన్ కు ఎమ్మెల్యే వేగుళ్ళ పరామర్శ

మండపేట, సింహగర్జన ప్రతినిధి, నవంబర్ 12 : మాతృ వియోగంతో భాదపడుతున్న యినపకోళ్ళ సత్యనారాయణ (ఐఎస్ఎన్) ను బుధవారం రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఈ సంధర్బంగా ఐఎస్ఎన్ మాతృమూర్తి సత్యవతి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థించారు.








# ఒంటరి తల్లిగా జీవించడం చాలా కష్టం: సానియా మీర్జా

**-పాడ్‌కాస్ట్‌లో ఫరా ఖాన్‌తో మనసు విప్పిన టెన్నిస్ స్టార్**
**-గతంలో పానిక్ అటాక్ వచ్చినప్పుడు ఫరా అండగా నిలిచిందని వెల్లడి**
**-సానియా ధైర్యాన్ని, బలాన్ని ప్రశంసించిన దర్శకురాలు ఫరా ఖాన్**
**-విడాకుల ప్రభావం పిల్లలపై తప్పక ఉంటుందని వ్యాఖ్య**
**-షోయబ్ మాలిక్‌తో విడిపోయిన తర్వాత ఒంటరిగా కుమారుడిని పెంచుతున్న సానియా**

భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, పాకిస్థాన్ క్రికెటర్ షోయబ్ మాలిక్‌తో విడాకుల తర్వాత తొలిసారి తన వ్యక్తిగత జీవితంలోని కష్టాల గురించి బహిరంగంగా మాట్లాడింది. ఒంటరి తల్లిగా తన కుమారుడిని పెంచడం 'చాలా చాలా కష్టం' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తన ఆప్తమిత్రురాలు, బాలీవుడ్ దర్శకురాలు ఫరా ఖాన్‌తో కలిసి నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ఆమె ఈ విషయాలను పంచుకుంది.

ఫరా ఖాన్ హోస్ట్ చేసిన 'సర్వింగ్ ఇట్ అప్ విత్ సానియా' అనే పాడ్‌కాస్ట్‌లో వీరిద్దరూ స్నేహం, మాతృత్వం, ఒంటరిగా పిల్లల్ని పెంచడంలో ఎదురయ్యే సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఫరా ఖాన్, సానియాను ప్రశంసిస్తూ, "ఒంటరి తల్లిగా ఉండటం కంటే కష్టమైనది ఏమీ లేదు. నువ్వు నీ కెరీర్‌లో ఉన్నత శిఖరాలను, వ్యక్తిగతంగా అట్టడుగు స్థితిని చూశావు. రెండింటినీ సమానంగా ఎదుర్కొన్నావు" అని అన్నారు. దీనికి సానియా స్పందిస్తూ, "ఇది చాలా చాలా కష్టం. మనందరికీ మన ప్రయాణం ఉంటుంది, సరైనది ఎంచుకోవాలి" అని తన కష్టాన్ని అంగీకరించింది.

ఈ సందర్భంగా తన జీవితంలో ఎదుర్కొన్న తీవ్రమైన ఒత్తిడి గురించి సానియా గుర్తుచేసుకుంది. ఒకసారి తనకు పానిక్ అటాక్ వచ్చినప్పుడు, ఫరా ఖాన్ సెట్‌కు వచ్చి అండగా నిలిచారని తెలిపింది. "ఆ రోజు మీరు రాకపోతే నేను ఆ లైవ్ షో చేసేదాన్ని కాదు. నేను వణికిపోతున్నాను" అని సానియా చెప్పగా, "నువ్వు పానిక్ అటాక్‌తో ఉండటం చూసి నేను భయపడ్డాను. షూటింగ్ ఉన్నా పైజమాలోనే పరిగెత్తుకుంటూ వచ్చేశాను" అని ఫరా ఆ సంఘటనను గుర్తు చేసుకున్నారు. సమాజంలో కష్టాల పట్ల దృక్పథం, విడాకుల సాధారణీకరణ వంటి అంశాలపైనా వీరిద్దరూ చర్చించుకున్నారు. గతంలో తల్లిదండ్రులు విడిపోవడం పెద్ద విషయంగా చూసేవారని, ఇప్పుడు అది సాధారణమైపోయిందని ఫరా పేర్కొన్నారు. అయితే, ఇది ఎంత సాధారణమైనా పిల్లలపై దాని ప్రభావం కచ్చితంగా ఉంటుందని సానియా అభిప్రాయపడింది.

సానియా మీర్జా 2010లో షోయబ్ మాలిక్‌ను వివాహం చేసుకుంది. వీరికి 2018లో కుమారుడు ఇజాన్ మీర్జా మాలిక్ జన్మించాడు. గతేడాది (2024) ఆరంభంలో వీరిద్దరూ విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకే షోయబ్ మాలిక్ పాకిస్థానీ నటి సనా జావేద్‌ను వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com